## సంక్రాంతి కథల పోటీలో రు. 116/- కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

*తనబొమ్మ తను చూసుకోవాలన్న సరదా తప్పు. తనబొమ్మ పడటంకూడా సహించలేని రాజాసుందరమ్మలుంటారని ఆ అంవిరిసిన అమాయకపు మల్లికేం తెలుసు?*

విసెప్ రాజాసుందరమ్మ చేతిలోని మేగ్‌జైన్ పేజీలు వూరికే తిరుగుతున్నాయి, కాని ఆమె చూపులు ఏ పేజీమీదా నిలవటం లేదు. పైన తిరిగే పంకా గాలి చల్లదనంగానీ, రేడియోలోంచి వినవస్తోన్న సంగీతంగానీ ఆమె మనస్సును ఆహ్లాదపరచటంలేదు. ఆమె మనస్సు మనస్సులోలేదు. ప్రొద్దుట తాను చూసిన దృశ్యంమీదకే మాటిమాటికి పోతూంది.

ఆ విషయం తలుచుకుంటే చాలు తన వళ్ళంతా క్రొత్త ఆవకాయ కారం రాసుకున్నట్లు మండిపోతూంది; మనస్సంతా కోపంతో కుతకుతలాడిపోతూంది....

ఈ అలగాజాతి జనం ఇదివరకు లాగా కాదు! మరీ హద్దుమీరిపోయారు! ఎన్నెన్ని టెక్కులు నేర్చారు! ఈ మల్లి ముండ మటుకు మల్లిముండ- వేలెడు లేదు గుంట! దీని కెంత పొగరు? ఎంత పొగరు లేందే అలా చేస్తుందా? అసలు నిన్న వుదయమే ఆ దృశ్యం తన కంటపడింది

అమ్మో అమ్మో. ఈ పనిముండలు — క్రొత్త వస్తువును క్రొత్తగా చూడటం కదా పోన్లే అని సరిపెట్టుకుంది. ఇవ్వాళ వుదయం కూడా మళ్ళీ అలా జరిగేసరికి ఈ ముండ కావాలనే చేస్తోంది అనుకుంది.

అందుకే తన వళ్ళు ఇలా దహించుకుపోతూంది.

ఇంతలో గుమ్మం దగ్గర అలికిడి అయింది. తలయెత్తి చూసింది. ఎదురుగుండా పనిపిల్ల మల్లి నిలబడివుంది. పనులన్నీ పూర్తిచేసి వచ్చింది.

దాన్ని చూడగానే సుందరమ్మకు ఒక క్షుద్రకీటకాన్ని చూసినంత అసహ్యం వేసింది.

"ఏఁవిటి?" పెళుసుగా అడిగింది.

మల్లి అమాయకంగా జాలిగా, "కూత్తంత పచ్చడేదన్నా పెట్టండమ్మగోరూ!" అంది.

"పచ్చడిలేదు ఏం లేదు పో!" కోపంగా అం .

మల్లి పాపం చిన్నబుచ్చుకుంది. పోన్లే అనుకుని తన పాత వైరుబుట్ట తీసికొని యింటికి బయలుదేరింది.

ఇంతలో సుందరమ్మకు మెరుపులాగా ఒక ఆలోచన తళుక్కుమంది. మళ్ళీ సావధానంగా అసలు దీనిబుద్ధి కనిపెట్టుదామనుకుంది.

"సరే పెట్టుతా వుండవే!" అని కూర్చున్న కుర్చీలోంచి లేచింది.

హాల్లోంచి వంటింటికేసి వెళ్ళుతూ, "నీ గిన్నె తెచ్చుకో!" అంది.

తను పచ్చడి తెచ్చేలోపల హాల్లో మల్లి ఏం చేస్తుందో కనిబెట్టుదామని సుందరమ్మ కావాలని వంటింట్లో అదీ, యిదీ సవరిస్తోంది

ఇంతలో మల్లి హాల్లో వున్న డ్రస్సింగ్ టేబిల్ వయిపుకు తిరిగి ఒక అడుగు ముందుకేసింది.

వంటింటి తలుపు ప్రక్కన నక్కి చూస్తోన్న సుందరమ్మకు గుండెలు దడదడలాడాయి.

మల్లి ఇంకో అడుగు ముందుకేసి. డ్రస్సింగ్ టేబిల్‌కు వున్న నిలువుటద్దంలో కనిపిస్తోన్న తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ పమిట సర్దుకుంటూంది.

"అదిగో అదిగో, అద్దంలో ఎలా షోకు చూసుకుంటూందో చూడు! తన అనుమానం నిజమే అయింది! దీని వెధవబుద్ధి తనకు తెలియనూ! ....నీ మొగం మండా! నీ అందానికి తోడు అద్దం కావాల్సి వచ్చిందా? ఇది మామూలు అద్దం కాదే కోతిమొగందానా! రెండువేల రూపాయలు పోసి కొన్న అద్దమే! నా యింట్లో నా డ్రస్సింగ్ టేబిల్ అద్దంలో నీ వెధవ మొగం చూసుకోటానికి నీకెంతధైర్యమే' అని మనస్సులో లబలబలాడిపోయింది.

"ఏం చేస్తున్నావే అక్కడ?" అంటూ గబుక్కున హాల్లోకి వచ్చేసింది.

మల్లి వులిక్కిపడి వెనక్కి తిరిగింది.

"ఊఁ - నీ గిన్నె పట్టు!" అంది.

పచ్చడికోసం గిన్నె ఎత్తి పట్టుకున్న మల్లి మొగం అమాయకంగా వుంది.

గిన్నెలో పచ్చడి పడేస్తూ మల్లివంక కొరకొరా చూసింది.

అమ్మగారు తనవంక ఎందుకంత కోపంగా చూస్తోన్నారో పాపం మల్లికి అర్థంకాలేదు.

పచ్చడిగిన్నె తన వైరుబుట్టలో సర్దుకొని "వత్తానమ్మగోరూ!" అంది మల్లి.

పోతూపోతూ మళ్ళీ యింకోసారి అద్దంలో చూసుకొని చిన్నగా నవ్వుకుంటూ పోయింది.

అది చూసి సుందరమ్మకు మళ్ళీ వళ్ళు మండిపోయింది. ఈ ముండ చూశావా పోతూ పోతూ మళ్ళీ అద్దంవంక చూస్తోంది? దీని కళ్ళన్నీ ఈ అద్దంమీదే!

### పరిచయం

పుట్టి పెరిగింది కృష్ణాజిల్లాలోని నూజివీడు. ఉద్యోగరీత్యా ప్రస్తుతం వుంటుంది హైదరాబాద్‌లో. ఉద్యోగం ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థలో ఎకౌంట్స్ ఆఫీసురు.

చాలాకాలంగా కథలు రాస్తున్నాను. కొన్ని కథలు ఇతర భాషల్లోకి కూడా అనువదింపబడ్డాయి. మూడు నవలలు కూడా వ్రాశాను.

చిన్న కథనే నమ్ముకున్నవాడ్ని చిన్నకథమీద ఎందుకో అందరికీ చిన్న చూపే! ముఖ్యంగా మన పబ్లిషర్స్‌కు మన తెలుగు సాహిత్య సాగరంలో సీరియల్స్ - నవలలూ అనే పెనుకెరటాలనే చూసి ఓహో - అహో అంటున్నారు కాని. చిన్న కథలనే చిరుకెరటాలను ఎవరూ చూడటంలేదు, పట్టించుకోవడంలేదనే ఆవేదన గుండెల్లో అప్పుడప్పుడూ తొలుస్తూంటూంది.

కథకులకు కూడా మంచిరోజులు వస్తాయని ఆశిస్తూ.

—అరిగే రామారావు

తను అక్కడే వున్నానన్న భయంకూడా లేదు దీనికి! ముండ ఎంత బరితెగించి పోయింది అనుకుంది.

సుందరమ్మ చేతులు కడుక్కొని డ్రెస్సింగ్ టేబిల్ దగ్గరిగా వచ్చింది. స్పాంజ్ సీటుతో వున్న స్టూలు లాక్కొని అద్దం ముందు కూర్చుంది.

రోజ్‌వుడ్ స్టాండ్‌లో బిగించిన బెల్జియమ్ నిలువుటద్దం తళతళ మెరిసిపోతూ. "నా కెవరు సాటి!" అని నడుం మీద చేతులు పెట్టుకొని ఠీవిగా, గర్వంగా నిలబడ్డ యువరాణిలాగా వుంది! డెకోలం టాప్‌తో



# అద్దం

అరిగె రమారావు

టేబిలూ. సొరుగులూ ధగధగ లాడుతున్నాయ్!

ఆ 'పీస్' మొత్తం క్రొత్త పెళ్ళికూతురులాగా 'నైస్'గా, ట్రిమ్‌గా వుంది!

తాను యెన్నాళ్ళగానో పోంగా పోరగా ఈ 'మనిషి' (ఇంటాయన) మొన్ననే కొన్నాడు. రెండు వేలు పైచిలుకు అయింది. కాని నాల్గురోజు లయిందో లేదో "అమ్మయ్యా! మనకీ డ్రెస్సింగ్ టేబిల్ వుంది!" అని తను గర్వపడే లోపలే ఈ "మిడిమేళం" వచ్చిపడింది! ఈ పనిపిల్ల మూలంగా తనకు మనఃశాంతి లేకుండాపోయింది! అది అటెళుతూ. ఇటెళుతూ అద్దం వంక చూస్తోంటే తన ప్రాణం గిలగిల్లాడిపోతూంది! పెద్ద "అవమానం" జరిగిపోయినట్లు బాధపడిపోతూంది.

సాయంకాలపు ఎండలోని ఎర్రదనం విరిగిపోతూం ి. పక్షులు యిళ్ళముఖం పట్టాయి.

సుందరమ్మ స్నానంచేసివచ్చింది. అలమరలోంచి బెనారస్ పట్టుచీర తీసి కట్టుకుంది. అప్పుడది ఆ చీర కట్టాల్సిన 'అకేషన్'కాకపోయినా ఆమెకాచీర మీదకే మనస్సుపోయింది! దొడ్లో పూసిన తెల్ల గులాబీలు కోసుకొని తెచ్చుకుంది.

డ్రెస్సింగ్‌టేబిలు ముందు కూర్చొని తల దువ్వుకోటానికి జుట్టుముడి విప్పుకుంది. ఆమె దీర్ఘ కేశాలు పెద్ద జలపాతంలాగా భుజాల మీదుగా దూకుతున్నాయ్. వెండిపొన్నులో వున్న దువ్వెనతో దువ్వుకుంటూ అదంలో తన అందాన్ని చూసుకొని మురిసిపోతూ గర్వంగా నవ్వుకుంది.

ఇంతలో అద్దంలో మల్లి కనిపించింది. చింపిరి జుట్టు, పిలకకొత్తెం, చిరుగుల లంగా. వెలిసిపోయిన పాతవోణీ. చిగిలిపోయిన జాకెట్టూ, జిడ్డోడుతున్న నల్లటి దిష్టి మొగం.

ఇది ఎందుకు మళ్ళీ తగలడింది అనుకుంటూ సుందరమ్మ చిరాగ్గా వెనక్కి తిరిగి చూసింది.

గుమ్మంలో ఎవరూ లేరు! అయితే ఇదంతా తన భ్రమన్నమాట!

మళ్ళీ అద్దం వంక మురిపెంగా చూసింది. గర్వంగా తల విసిరేసింది.

మన్నికకు ప్రసిద్ధిచెందినవి.
అశోకా పెన్స్ & బాల్ పెన్నులు
REGD. No. 143646
అశోకా పాళీలు లాంగ్ లైఫ్ పాయింట్లతో తయారుచేయబడుచున్నవి.
అశోకా పెన్ వర్క్సు, తెనాలి. (ఆంధ్ర)

పవిత్ర రుద్రాక్ష
1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపు పచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించే శ్రేష్ఠమైన రాళ్ళు లభించును. కోరినవారికి ధరలపట్టి పంపబడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.
Shree Jagdamba Bhawan
(A. J.) SONEPAT-131001.

తారల ఫోటోలు
శ్రీదేవి., జయసుధ., జయప్రద., జయమాలిని, సుజాత., మాధవి., ప్రభ., కవిత., ఏయన్నార్, ఎన్టీఆర్., శోభన్‌బాబు., కృష్ణ., కృష్ణంరాజు, మోహన్‌బాబు., కమలహాసన్., చిరంజీవి!
వీరిలో ఎవరి ఫోటో కావాలన్నా ఫోటోకి 3 రూ॥లు. ఎం.ఓ. చేయాలి....!
ఫోటోతోపాటు సినీతారల అడ్రసులున్న పుస్తకం కూడా పంపబడును!
ఎవరి ఫోటో కావాలో వ్రాయడం మరువకండి!
వై.కె.మూర్తి.
దాసరివారి వీధి ✻ విజయవాడ-2.




బెనారస్ చీరలూ, కంచి పట్టుచీరలూ చూసుకోవాల్సిన అద్దం యిది! క్రీంలూ, స్నోలూ, ఫేస్‌పౌడర్లూ రాసుకున్న నాజూకు మొగాలూ, అందమైన అజంతా కొప్పులూ, వాల్జడలూ చూసుకోవాల్సిన అద్దం యిది! అంతేగాని చింపిరిజుట్టులూ జిడ్డు మొగాలూ, కుళ్ళు గుడ్డలూ చూసుకునే 'అలగా' అద్దంకాదు ఇది! ఇది 'స్టేటస్' వున్న వాళ్ళు చూసుకోవాల్సిన అద్దంగాని, గుడిశలవాళ్ళూ పనివాళ్ళూ చూసే అద్దంకాదు ఇది అనుకుంది.

ఇంత ఖరీదైన, అందమైన అద్దంలో తనలాటి అందగత్తె చూచుకునే అద్దంలో మల్లిలాంటి అలగా ముండా, పాచిపని చేసేది తన దిష్టిమొగం చూసుకున్నదన్న వూహే తనకు కంపరమెత్తిస్తోంది- డోకు తెప్పిస్తోంది!

గబగబా లేచి లోపల్నుంచి 'పేనల్ క్లాత్' తీసికొచ్చి దాంతో అద్దాన్ని అంతా శుభ్రంగా తుడిచింది. అలా తుడవటంతో అద్దానికి "ప్రాయశ్చిత్తం" చేశానని తృప్తిపడింది. మనస్సు నెమ్మదించింది.

సుందరమ్మ ఇక్కడ డ్రస్సింగ్ టేబిల్ అద్దం ముందు కూర్చొని జుట్టు దువ్వుకుంటున్న సమయానికి అక్కడ మల్లి వాళ్ళ గుడిశముందు కుక్కిమలక మంచంలో వళ్ళో పాత అద్దం పెంకు పెట్టుకొని కూర్చొంది.

గుడిశ ముందున్న వేపచెట్టు విరగబూసి వుంది- వయస్సు పడద్రోసుకు ఎస్తోన్న కన్నెపిల్లలాగా గుత్తంగావుంది. చెట్టు కొమ్మన కూర్చున్న పిల్లకోకిల కొత్తగా గొంతు సారించుకుంటోంది.

మల్లికెందుకో మహా చిరాగ్గా వుంది, బోలెడు కోపంగా వుంది,

మొగం చూసుకోవటానికి యింట్లో సరైన అద్దం లేదు. వున్న అద్దానికి కళాయి పోయి వెలాతెలాబోతు సరీగ్గా కనిపించటం లేదు

దువ్వుకోటానికి సరైన దువ్వెన లేదు. వున్న కొమ్ము దువ్వెనకు పళ్ళు వూడిపోయాయి.

తలకు రాసుకుందామంటే యింట్లో నూనె లేదు. వారం రోజులుగా నూనె రాయక తలంతా కంపలాగా వుంది. నూనె తెచ్చుకుంటా డబ్బు లియ్యమని తల్లిని అడిగితే "సంజకు సోకులెక్కువయ్యాయే! నీకు గొబ్బిరినూనె తేటానికి, అత్తరి నూనెలు తేటానికి నాకాడ డబ్బు లేదు న్నాయే గుంటా!" అని తిట్టిపోసింది.

మల్లి పోయినేడే ఈడేరింది. మల్లికి యిప్పుడిప్పుడే పమిట నిలుస్తోంది. ఇప్పుడిప్పుడే రయిక బిగుస్తోంది. వూరికే మాటిమాటికి అద్దంలో చూచుకోవాలని యిప్పుడిప్పుడే అనిపిస్తోంది జుట్టు దువ్వుకొని సుబ్బరంగా వుండాలనీ, మాటిమాటికీ పమిట సర్దుకోవాలనీ యిప్పుడిప్పుడే అనిపిస్తోంది!

సరీగ్గా మల్లికి అలా అనిపిస్తోన్నప్పుడే సుందరమ్మగారింట్లోకి కొత్త అద్దం వచ్చింది. ఆ అద్దాన్ని చూస్తోంటే మల్లికి మహా సంబరంగా వుంటుంది. కొత్త అద్దం తళతళలాడుతూ ఎంతో బాగుంటుంది. దాంట్లో చూసుకుంటుంటే తన బొమ్మ తనకే వింతగా, గమ్మత్తుగా, సరదాగా వుంటుంది. ఎంతసేపు చూసుకున్నా, ఎన్నిసార్లు చూసుకున్నా ఇంకా ఇంకా చూసుకోవాలనే అనిపిస్తుంది.

మర్నాడు వుదయం మల్లి మాములుగా పనికి వచ్చింది. కాని మామూలు చింపిరి అవతారంతో రాలేదు. ప్రక్క గుడిశ పద్దమ్మ దగ్గర "కూత్తంత గొబ్బిరినూనె" బదులు తీసికొని, తలకు రాసుకొని జడేసుకొని, మేరమ్మగారింట్లో గన్నేరుపూలు కోసుకొని జడలో పెట్టుకొని మరీ వచ్చింది.

వచ్చిన దగ్గర్నుంచి దాని చూపులన్నీ డ్రస్సింగ్ టేబిల్ అద్దంమీదే వున్నాయి!

వంటింటి 'మోరి'లోని అంట్లు బయట పంపు దగ్గరకు తీసుకెళ్ళి తోమి తీసుకు రావాలన్నా, వాకిలి ముందు చిమ్మి 'ముగ్గు కర్ర' వెయ్యాలన్నా ఆ హాల్లోంచి ఆ డ్రస్సింగ్ టేబిలు అద్దం ముందునుంచే వెళ్ళాలి! అటు వెళ్ళేటప్పుడూ, ఇటు వచ్చేటప్పుడూ మల్లి దృష్టి అంతా ఆ అద్దం మీదే! నూనె రాసుకొని వేసుకున్న జడనూ, జడలో పెట్టుకున్న గన్నేరుపూలను అద్దంలో చూసుకుంటూ తెగ సంబరపడిపోతూంది: మురిసిపోతూంది!

పాపం ఆ సంబరం ఎంతోసేపు నిలవలేదు!

మల్లి చేష్టలను బెడ్‌రూం కిటికీలోంచి కనిపెడుతూన్న సుందరమ్మ బర్రున బయటికి వచ్చేసింది.

మల్లిమీద వూరికే అజమాయిషీ చేస్తూ దాని వెనకాలే తిరగ సాగింది.

రోజూ ఏడుగంటలు దాటినా పడగ్గది లోంచి బయటికిరాని అమ్మగారు యివ్వాళ యింత ప్రొద్దున్నే యెందుకు లేచారో, తన వెనకాతలే పడి ఎందుకు తిరుగుతున్నారో పాపం మల్లికి అర్థం కాలేదు. అంతకు ముందు తన పనితనాన్ని మెచ్చుకున్న అమ్మగారు యివ్వాళ ఎందుకని తను చేస్తోన్న ప్రతి పనికీ వంకలు పెడుతున్నారో, అయినదానికీ కానిదానికీ

వూరికే ఎందుకు సాధిస్తున్నారో కూడా మల్లికి అర్థం కాలేదు.

అన్యమనస్కంగానే అన్ని వస్లు పూర్తి చేసి ఆ రోజు పనిలోని ఆఖరి అంశంగా యిల్లు వూడ్చే కార్యక్రమంలోకి దిగింది.

చీపిరికట్ట తీసికొని హాల్లోకి వచ్చింది. ఎదురుగుండా అద్దంలో తన ప్రతిబింబం కనిపించింది దాని చేతిలో కూడా చీపిరి కట్ట వుంది. చీపిరికట్టను ఈ చేతిలోంచి ఆ చేతిలోకి మార్చుకుంది. అద్దంలోని బొమ్మ కూడా మార్చుకుంది. ఆ బొమ్మను చూస్తూ నాలిక బయటపెట్టి కొంటెగా ఎక్కిరించింది. అదీ ఎక్కిరించింది.

ఇదంతా మల్లికి గమ్మత్తుగా వుంది! ఇలా అద్దంలోని బొమ్మతో ఆటలు ఆడు కుంటూ ప్రొద్దుట్నుంచి అమ్మగారు తిట్టిన తిట్లూ, సాధింపులూ మర్చిపో యింది. మల్లి మనస్సు విరగబూసిన మల్లిపందిరే అయింది!

పమిటను బిగుతుగా నడుంచుట్టూ చుట్టు కొని హాలు వూడవటానికి సంసిద్ధమవు తుండగా సుందరమ్మ యెక్కడ్నుంచి వచ్చిందో బర్రున వచ్చి మల్లి చేతిలోని చీపిరికట్ట లాక్కుంది.

"ఈ హాలు నేను వూడుస్తాలే గాని. నీవు మిగతా గదులు వూడువ్వ!" అంది.

మల్లి మనస్సనే మల్లిపందిరి కర్ర లన్నీ లాగేసినట్లు నేల కొరిగింది!

అమ్మగారు హాలు వూడవటం ఏంవిటి? మల్లికి అమ్మగారి ఆంతర్యం అర్థంగాక బిక్కమొగం వేసుకొని చూస్తూ అక్కడే నిలబడిపోయింది.

"అలా చూస్తావేం? వెళ్ళు!" అని సుందరమ్మ గద్దించింది.

నేలకొరిగిన మల్లిపందిరిని పొగరు బోతుగొడ్డు కాళ్ళతో తొక్కేసింది!

మల్లి హాల్లోంచి మెల్లగా ప్రక్కగది లోకి వెళ్ళిపోయింది. అద్దంలోని బొమ్మ జాలిగా, బేలగా ప్రక్కకు తప్పుకుంది.

సుందరమ్మ హాలు వూడవటానికి సిద్ధ మయింది.

హాలు ఒకప్రక్క వూడ్చేసరికి సుంద రమ్మ పని అయిపోయింది! కళ్ళు తిరిగి నంత పనయింది.

'ఇంత వుందేంటి మాయదారి హాలూ!' అని ఆ హాలును తిట్టుకుంది.

హాలు పూర్తిగా వూడ్చేసరికి సుంద రమ్మకు ముచ్చెమట్లు పోసి ఆయాసం వచ్చింది.

ఫ్యాన్ వేసుకొని కుర్చీలో కూలబడి ఆపసోపాలు పడుతూ, "ఎంత కష్టమొచ్చి పడిందిరా భగవంతుడా!" అని వాపో యింది. ఈ మల్లిగుంట తన ప్రాణానికి


ఫోర్‌హేన్స్
పళ్ళడాక్టరు
సృష్టించిన టూత్‌పేస్టు




పళ్లను శుభ్రపరచడమేకాక
చిగుళ్లను దృఢపరచడానికి తోడ్పడుతుంది

చిగుళ్ల బాధల వల్ల ఆరోగ్యమైన పళ్లు కూడా ఊడిపోవచ్చు



పళ్ల డాక్టర్లు ఏమంటున్నారంటే పళ్లను చక్కగా శుభ్రం చేసుకోకపోతే పళ్ళ, చిగుళ్ల చుట్టూ పాచి అనబడే సూక్ష్మజీవుల పొర ఏర్పడుతుంది. దీన్ని అశ్రద్ధ చేస్తే పళ్లు గారకడతాయి. ఇది చిగుళ్లను బలహీనపరుస్తుంది. ఫలితంగా ఆరోగ్యమైన పళ్లు కూడా పట్టు తప్పి పడిపోవచ్చు. చిగుళ్ల బాధలు అనారోగ్యానికి దారి తీయవచ్చు

ఫోర్‌హేన్స్ చిగుళ్లను రక్షిస్తుంది



డాక్టర్ ఫోర్‌హేన్స్ యొక్క అద్వితీయమైన ఫార్ములా లోని ప్రత్యేకమైన అస్ట్రింజంట్ చిగుళ్లను దృఢపరచి, చిగుళ్ల బాధలు నివారించడానికి తోడ్పడుతుంది.
అంచేత, ఫోర్‌హేన్స్ టూత్‌పేస్టు, ఫోర్‌హేన్స్ డబుల్ యాక్షన్ టూత్‌బ్రష్‌తో మీ పళ్లను బ్రష్ చేసుకొని చిగుళ్లని మాలిష్ చేసుకోండి.

267F-222 TEL




ఫోర్‌హేన్స్
చిగుళ్ల కోసం

Regd. T.M. Geoffrey Manners & Co. Ltd.

ఎక్కడ తగలడిందో అని గింజుకుంది.

అప్పుడామెకు వాళ్ళ పాత పనిమనిషి ఆంతాళ్ళు గుర్తుకొచ్చింది. ఈ మల్లికి ముందు ఆండాళ్ళే చేస్తుండేది. ఆండాళ్ళుకు ఇద్దరు పిల్లలు కూడా వున్నారు. వున్న వాళ్ళు చాలరన్నట్లు మళ్ళీ మూడోసారి నీళ్ళు పోసుకుంది. నెలలు వచ్చేదాకా అదే చేసింది. కనటానికి పోతూ ఈ మల్లిని అప్పజెప్పిపోయింది. ఆ ఆండాళ్ళు అయితే తనకిప్పుడు ఈ చావు వుండేది కాదు దానికి ఈ టెక్కులు. కులకటాలూ లేవు. సరిగ్గా తను డ్రెస్సింగ్ టేబుల్ కొనుక్కునే ముందే ఈ ఆండాళ్ళుకు కడుపు రావాలా? వున్న పిల్లలు చాలరూ-మళ్ళీ దీనికిప్పుడు పిల్లలెందుకో అని దాన్ని తిట్టుకుంది....సరే. దాని ఏడుపేదో అది ఏడ్చింది! ఆ పెట్టేదేదో ఈ "కులుకుడు" గుంటను కాకుండా ఏ ముసలిదాన్నో పెట్ట కూడదూ! తనకీ మానసిక చిత్రవధ తప్పేదిగదా!

పోనీ దీన్ని మాన్పించేద్దామంటే అనుకున్నప్పుడల్లా పనిమనుషులు అంత తేలిగా దొరికిచావరు! ఈ మల్లి గుంటకు అద్దంలో షోకులు చూసుకునే ఈ మాయరోగం తప్పిస్తే పని చక్కగా, వైనంగా చేస్తుంది.

ఇంకారోజు సుందరమ్మకు ఏ పనీ చేయ బుద్ధి కాలేదు. అన్నం సరిగ్గా సహించ లేదు రేడియో వినాలనిపించలేదు నవల్సు మీదకు మనస్సు పోలేదు. ఫోన్లో (ఆఫీసు వాళ్ళు పెట్టించింది) స్నేహితురాళ్ళతో మాట్లాడి ఆ పూట వాళ్ళేం కూరలు చేసుకున్నారో కనుక్కోవాలనిపించలేదు. మహిళామండలికి వెళ్ళాలనిపించలేదు.

ఆమె ఆలోచనలన్నీ ఈ మల్లి మీదా తన డ్రెస్సింగ్ టేబిల్ మీదే! అంత డబ్బుపోసి కొన్న తన వస్తువును ఒక 'పనిముండ' మురిసిపోతూ వాడటం ఆమె సహించలేకపోతూంది.

సాయంత్రం భర్త యింటికి రాగానే పనిపిల్ల చేస్తోన్న ఈ అఘాయిత్యప్పని గురించి చిలవలు పలవలుగా వర్ణించి చెప్తూ తన మనస్సులోని బాధను వెళ్ళ బోసుకుంది.

ఆయనగారు అంతా విని కొన్ని లీగల్ పాయింట్లు తీశాడు. (అసలే ఆయన లీగల్ ఎడ్వయిజర్!)

"మల్లి డ్రెస్సింగ్ టేబిల్ దగ్గరిసా వెళ్ళిందా?"

"లేదు."

"దాన్ని చేత్తో తాకిందా?"

"లేదు."

"పోనీ దానిముందు నిలబడిందా!"

"లేదు"

"అంటే ఇటొచ్చి, అటొచ్చి, ఇటు పోతూ, అటుపోతూ అద్దం వయిపు చూస్తోంది– అందులో కనిపిస్తోన్న తన ప్రతిబింబాన్ని చూసుకుంటూంది. అంతేగా!" అన్నాడు

సుందరమ్మ వుషారుగా, "అవునవును. కరక్టుగా మీరు చెప్పినట్లే చేస్తోంది...." అంది. అందుకే దాన్ని ఏమీ అనలేకపోతూంది; ఇలా కక్కాలేక, మింగాలేక చస్తోంది!

ఆయన నవ్వేస్తూ, "పోనే చూసుకోనీ వోయ్! నీదేంపోయింది? పాపం, పిల్లది సరదాపడుతూంది. లెట్ హర్ హేవ్ దట్ లిటిల్ ఎన్జాయ్‌మెంట్!" అన్నాడు

తనదేం పోయిందా? తన 'స్టేటస్' పోయింది! మన స్టేటస్‌ను ఎలా కాపాడుకోవాలో తెలియని మనిషి! తన బాధ యింకెలా చెప్పితే ఈయనకు అర్థం అవు


కావలెను

INDIAN TECHNICAL EDUCATIONAL SOCIETY

మా సంస్థ ఆధీనములో ఆంధ్రప్రదేశ్‌లోని అని TOWNSలో ప్రారంభించనున్న బ్రాంచీలలోను, డిపోలలోను పనిచేయుటకు సమర్థులైన నిరుద్యోగులు కావలెను.

| NAME OF THF POST | QUALIFICATION | SALARY |
|---|---|---|
| 1. BRANCH MANAGERS | ANY DEGREE | Rs. 450/- |
| 2. SALES ASSISTANTS | INTER/S.S.C, | Rs. 380/- |
| 3. DELIVERY BOYS | 7th Std | Rs. 250/- |

అన్ని వివరములు APPLICATION FORM నకు క్రింది అడ్రసుకు రు. 3/- M.O చేసి పొందవచ్చును.

I.T.E SOCIETY, MADRAS-26





నాలుగు మాసముల

కాయకల్ప చికిత్స

మా నాన్నగారైన మహారాజశ్రీ రుద్ర పంక్తి త్రియంబక దేవరగారు (66 సం॥ వయస్సు) పది సంవత్సరముల నుంచి క్షయ (T.B) వ్యాధితో బాధపడుతూ యుండిరి. వారికి పూరీ బరంపురం (గంజాము) పర్లాకిమిడి మొదలగు పలుచోట్లలో చికిత్స చేయించితిమి. కాని వ్యాధి నివారణ కాలేదు దీనికి తోడు 6 సం॥ల క్రిందట పృష్ఠాలికి బోధ వ్యాధి సంక్రమించినది దీనికి ఆపరేషన్ చేయించగా తాత్కాలికంగా బాధలు తగ్గినవి. కాని కొద్ది కాలమునకే యథాప్రకారము బాధలు కలిగినవి.

ఇక వేరే గత్యంతరము లేక విశాఖపట్టణము పెదవాల్తేరులోని శ్రీ యోగాశ్రమములో చేర్పించి 4 మాసములు కాయకల్ప చికిత్స చేయించితిమి ఇందువల్ల క్షయవ్యాధి, బోధవ్యాధి పూర్తిగా నివారణ అయి సంపూర్ణముగు ఆరోగ్యము కలిగి సుఖముగా యున్నారు. ఈ చికిత్సవలన దేహములోని అన్ని వ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగుట ఒక గొప్ప విశేషము. మాకు యిలాంటి ఉత్తమ చికిత్సచేసిన శ్రీ రాఘవేంద్రయోగిగారికి మా కృతజ్ఞతలు తెలియజేస్తూ యున్నాము.

ఇట్లు

ఆర్. డి. దేవర

మేనేజరు, ఓరియంటల్ కమర్షియల్ బ్యాంక్

టౌన్ షూర్, పూరి జిల్లా, (ఒరిస్సా)

తుంది? ఈ మగవాళ్ళెప్పుడూ యింతే అని విసుక్కుంది.

భర్తతో తర్కించకుండా ఆ విషయాన్ని అంతటితో వదిలేసింది.

ఆ విషయం మాత్రం ఆమెను అంత తేలిగ్గా వదల్లేదు. రాత్రి కలలో కూడా అదే! మల్లి తన డ్రస్సింగ్ టేబిల్ ముందు కూర్చొని, అద్దంలో చూసుకుంటూ, తను వాడే స్నోలూ, క్రీంలూ, ఫేస్ పౌడర్లూ పూసుకుంటున్నట్లూ, మల్లి స్థానంలో తాను అంట్లు తోముతున్నట్లూ కనిపించింది. ఉలిక్కిపడి లేచి కూర్చుంది. ఒక భయంకరమైన పీడకల కన్నట్లు యమ కంగారుపడిపోయింది!

మళ్ళీ నిద్రపట్టలేదు.

* * *

ఆ రోజు అట్లతద్ది పండుగ.

మల్లి మామూలు కంటె ప్రొద్దున్నే లేచింది. వీధికుళాయి దగ్గర్నుంచి నీళ్ళు పట్టుకొచ్చుకొని స్నానం చేసింది వాళ్ళక్కది వాయిలు చీర కట్టుకుంది. వాళ్ళక్క చేత జడేయించుకుంది.

ఇంట్లోవున్న అద్దం పెంకులో మొగం చూసుకోబోతే సరిగ్గా కనిపించలేదు.

"వెధవ అద్దం!" అంటూ విసుగ్గా దాన్ని వాళ్ళక్క వళ్ళోకి విసిరేసింది.

"ఇంట్లో వున్నది అదేనే తల్లీ! దాన్ని కాస్త పగలకొడతావా ఏంటీ?' అంది వాళ్ళక్క.

"పోతే పోనీయ్, బోడి అద్దం!" అంటూ తన వెదురుబుట్ట తీసికొని పరుగు దీసింది.

తను చూసుకోవటానికి పెద్ద పెద్ద నిలువుటద్దాలే వున్నాయి అనుకుంది గర్వంగా.

దార్లో మేరమ్మగారింటి దగ్గర ఆగి, గన్నేరుపూలు కోసుకొని జడలో తురుముకొంది.

శివాలయం రావిచెట్టుమీదగా సూర్యుడు ఎర్రగా పైకి లేస్తోన్నాడు. తొలి వెలుగులు పడి శివాలయం చెరువు అద్దంలాగా తళతళలాడుతూంది ఆ అద్దంలో మొగం చూసుకోవాలని ఆకాశంలో ఒక మబ్బు తునక పరుగెత్తుకొస్తోంది.

మల్లి నేరుగా సుందరమ్మగారింటికే బయలుదేరింది.

అమ్మగారు లేచి గదిలోంచి బయటికి రాకముందే అద్దంలో తన చీరషోకు తనివి తీరా చూసుకోవాలని వువ్విళ్ళూరుతూంది. పెద్ద పెద్ద అంగలేసుకుంటూ సుందరమ్మగారింటికి చేరుకుంది.

ముందు తలుపు తీసేవుంది.

తన బుట్టను ముందుగదిలో ఒకమూల పెట్టుకుంది. ఉషారుగా హాల్లోకి అడుగు పెట్టబోయి యెదురుగా కనిపించిన దృశ్యాన్నిచూసి బిత్తరపోయింది. నిల బడ్డచోటే బొమ్మలాగా నిలబడిపోయింది. అప్పటిదాకావున్న వుషారంతా ఆవిరయి యెగిరిపోయింది.

హాల్లోకి అడుగుపెట్టగానే యెదురుగా కనిపించే డ్రస్సింగ్ టేబిల్ వుండవల్సిన స్థానంలో లేదు. దాని స్థానంలో పెట్టిన


## దరఖాస్తులు కోరబడుచున్నవి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే రిజిష్టరు చేయబడినది

ఉద్యోగములు: 1. Clerks. 2. Cashiers. 3. Accountants. 4. FieldMan 5. Field Asst. 6. Sub Asst. 7. Field Mastry. 8. Craft Teachers.

విద్యార్హత: 7th Pass, S.S.C., Inter, Degree Pass or Fail.

జీతము: రు. 480/- నుండి రు. 720/-లు వరకు పొందవచ్చును.

పై విద్యార్హతలు గలవారు అగ్రికల్చర్, అకౌంటెన్సీ, బ్యాంకింగ్ కోర్సులందు రెగ్యులర్/పోస్టలు ద్వారా శిక్షణ పొంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షలందు ఉత్తీర్ణులైనవారు పై ప్రభుత్వోద్యోగములలో నియమింపబడుటకు అర్హులు. రెగ్యులర్ విద్యార్థులకు భోజన, హాస్టలు వసతి కలదు. దరఖాస్తు ఫారము, పూర్తి వివరములకు 12 రోజుల లోగా ఆరు 10 పై పోస్టు స్టాంపులు క్రింది అడ్రసుకు పంపి పొందవచ్చును.

**Principal**

S.N.A.T. Training Institute, Addanki-523201, Prakasam Dt A.P.



## సంక్రాంతి శుభాకాంక్షలు




దొరుకు చోట్లు:

1) కూలర్స్ —ఏలూరు రోడ్. విజయవాడ
2) యూనివర్శల్ మార్కెటింగ్ ఏజెన్సీస్ —విజయవాడ
3) యస్.వి.యస్. డీలక్స్ ఫ్యాన్సీ & బుక్ సెంటర్ —పటమట, విజయవాడ
4) యశస్వి ఎంటర్‌ప్రైజెస్ —మచిలీపట్టణం
5) చంద్రశేఖర్ ఏజెన్సీస్ —తాడేపల్లిగూడెం
6) శ్రీ లక్ష్మి ఏజెన్సీస్ —రాజమండ్రి
7) విశ్వరూప ఫర్నిచర్స్ —ఒంగోలు
8) దేవ్ అండ్ కో —గుంటూరు
9) ప్రేమా ఇంజినీరింగ్ & జనరల్ ఏజెన్సీస్ —అమలాపురం
10) అమరజ్యోతి రేడియో కార్పొరేషన్ —ఏలూరు

గాద్రెజ్ బీరువా మల్లినిచూసి వెక్కిరించింది !

గుబగుబలాడుతూన్న గుండెలతో మల్లి హాల్లోకివచ్చి అద్దంకోసం నలుమూలలా చూసింది. డ్రెస్సింగ్ టేబిల్ సెట్ మొత్తం ఆ హాల్లోంచి మాయమైపోయింది.

మల్లి బిక్కమొగం వేసుకుంది. నీరసంగా అడుగులో అడుగేసుకుంటూ వంటింట్లోకి వెళ్ళి, "మోరి"లో అంట్లు తీసికొని మళ్ళీ హాల్లోకి వచ్చింది. హాలు మధ్యలో నిలబడిపోయి, నలువైపులా బిత్తర చూపులు చూసింది.

బెడ్ రూం కిటికీలోంచి చూస్తూ ఇదంతా కనిపెడుతూన్న సుందరమ్మ కసిగా నవ్వుకుంది. "తిక్కరోగం కుదిరింది ముండకు !" అని తెగ సంతోషపడిపోయింది.

అంట్లపని పూర్తిచేసి యిల్లు వూడవటానికి మల్లి చీపిరికట్ట తీసికొని వచ్చింది

బెడ్ రూం గుమ్మం దగ్గరకు రాగానే దాని మొగం వికసించింది. బెడ్ రూంలో వున్న డ్రెస్సింగ్ టేబిల్ ను చూడగానే దాని మనస్సు ఆనందంతో గంతులేసింది.

సుందరమ్మ లోపల్నుంచి గుమ్మంలోకి వచ్చింది.

"ఆడుండే అద్దం ఈ గదిలో ఎప్పుడు పెటించారు అమ్మగోరూ !" అంటూ వుషారుగా లోపలికి వెళ్ళబోయింది.

గుమ్మానికి చెయ్యి అడ్డంగా పెట్టి సుందరమ్మ, "ఆఁగు !" అని అటకాయించింది.

మల్లి బిత్తరపోయి చూసింది.

"ఇవ్వాల్టినుంచి నీవు బెడ్ రూం వూడవఖ్ఖర్లేదు !" అంది.

బిక్కమొగం వేసుకున్న మల్లివంక 'చూశావా, నీమీద ఎలా దెబ్బతీశానో !' అన్నట్లు ఎగతాళిగా చూస్తూ, గర్వంగా, కసిగా నవ్వుకుంది.

